సాక్షి యాదాద్రి భువనగిరి

శుక్రవారం | 26 | సెప్టెంబర్ | 2025



శ్రమదానాలు చేయాలి

గ్రామాల్లో ప్రజల సహకారంతో శ్రమదానాలు నిర్వహించాలని కలెక్టర్ హనుమంతరావు పిలుపునిచ్చారు. - 11లో



అర్హులందరికీ ఇళ్లు

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. - 11లో



ఎన్నికల్లో సత్తా చాటుతాం

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. - 11లో

న్యూస్‌రీల్

ఉత్పత్తి ధరలకే చేనేత వస్త్రాల విక్రయం



విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చేనేత జౌళి శాఖ ఏడీ శ్రీనివాసరావు

చౌటుప్పల్ రూరల్: చేనేత వస్త్రాలను ఉత్పత్తి ధరకు విక్రయించడం అభినందనీయమని చేనేత జౌళి శాఖ ఏడీ అన్నదేవర శ్రీనివాసరావు అన్నారు. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం పరిధిలోని టెక్స్‌టైల్ పార్క్‌లో సాధారణ వస్త్రాల విక్రయ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం 50 ఎకరాల్లో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేసిందన్నారు. పార్క్‌లో ఇంకా ఉత్పత్తి పెంచేలా యజమానులతో మాట్లాడుతామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, టీజీఐఐసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ భవాని, టిప్ ప్రధాన కార్యదర్శి ఎం,గోపాలరావు, టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధి అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఐలా సర్వీస్ చైర్మన్ ఎంకేడి ప్రసాద్,నిర్వాహకులు కే.కృష్ణమూర్తి,వేణు,రీజీమా,చిట్టిబాబు,శ్రవణ్‌కుమార్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్సన్ ఇంచార్జి చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన అనంతరం సమావేశంలో పాల్గొన్న దామోదర్‌రెడ్డి

చౌటుప్పల్ : చౌటుప్పల్ పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జి చైర్మన్‌గా చింతల దామోదర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్‌గా ఉన్న దామోదర్‌రెడ్డిని తప్పించి ఆయన స్థానంలో రామన్నపేట అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.సురేష్‌ను పర్సన్ ఇంచార్జిగా ఈనెల 10వ తేదీన నియమించారు. తనను తప్పించడాన్ని సవాల్ చేస్తూ దామోదర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా.. 28413/ 2025 ప్రకారం ఆయనను మళ్లీ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్యను మినహాయించి మిగతావారిని పర్సన్ ఇంచార్జి డైరెక్టర్లుగా అనుమతిస్తూ ఆదేశించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఈఓ రమేష్, సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలపై చర్చించారు. వచ్చే నెల 7న సర్వసభ్య సమావేశం నిర్వహించాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. చైర్మన్‌ను సభ్యులు సత్కరించారు.

రోగనిరోధక టీకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎయిమ్స్ వైద్యులు

బీబీనగర్: స్వస్థ్‌నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ భాగంగా గురువారం బీబీనగర్ ఎయిమ్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రోగనిరోధ టీకాలపై రోగులకు అవగాహన కల్పించారు. టీకాలు ప్రాణాలు ఎలా కాపాడుతాయో నాటక ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ అభిషేక్ ఆరోరా, వైద్యులు నీరజ్ అగర్వాల్, సయ్యద్ అహ్మద్ జాకి, జ్యోతి, రుచిశుక్లా తదితరులు పాల్గొన్నారు.

అపురూపం.. అమ్మదర్శనం



యాదగిరిగుట్ట: ఆలయాలు శరన్నవరాత్రి ఉత్సవాలతో శోభాయమానంగా అలరారుతున్నాయి. నాలుగో రోజు బుధవారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామికి అనుబంధంగా ఉన్న శివాలయంలో అమ్మవారు శ్రీపర్వతవర్థిని దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రాతఃకాల పూజ, అర్చనలు, పారాయణాలు, శ్రీదేవి జపాలు, సహస్ర నామార్చన నిర్వహించారు. సాయంత్రం నవావరణ పూజ, కుంకుమార్చన, నీరాజన మంత్ర పుష్పములు, తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. ఈ వేడుకల్లో ఆలయ ఈఓ రవినాయక్, అధికారులు పాల్గొన్నారు.

శ్రీపర్వతవర్థిని దేవి అలంకరణలో దర్శనమిస్తున్న దుర్గామాత

కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురం



బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, అధికారులు

భువనగిరి: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రాంగణం గురువారం బతుకమ్మ సంబరాలతో సందడిగా మారింది. కలెక్టరేట్ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌ఓ జయమ్మ తదితర ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొని బతుకమ్మ ఆడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని కలెక్టర్ అన్నారు.

మోతె పిచ్చిరెడ్డికి షోకాజ్ నోటీసు జారీ

ఆత్మకూరు(ఎం): ఉమ్మడి నల్లగొండ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (డీఎల్‌డీఏ) మాజీ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డికి కాంగ్రెస్ పార్టీ గురువారం షోకాజ్ నోటీస్ జారీ చేసింది. మదర్ డైయిరీ ఎన్నికల్లో పోటీ చేయడానికి కాంగ్రెస్ తరఫున పలువురు నామినేషన్ దాఖలు చేయగా.. అందులో పిచ్చిరెడ్డి సతీమణి మోతె పూలమ్మ కూడా ఉన్నారు. నామినేషన్ ఉపసంహరింపజేయాలని జిల్లా నాయకత్వం పిచ్చిరెడ్డిని కోరింది. అయినా పోటీనుంచి విత్‌డ్రా చేయించకపోవడంతో పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పిచ్చిరెడ్డికి షోకాజ్ నోటీస్ ఇచ్చినట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి తెలిపారు. షోకాజ్ నోటీసుకు 24 గంటల్లో వివరణ ఇవ్వాలని, లేనిచో పార్టీ నుంచి ఆరు సంవత్సరాల పాటు సస్పెండ్ చేయనున్నట్లు నోటీసులో పేర్కొన్నారు.

అర్జీలకు.. రెండు రోజులు

సోమవారం ప్రజావాణి.. గురువారం ప్రజాదర్బార్

- ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక గ్రీవెన్స్
- ప్రతి గురువారం మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజాదర్బార్
- పూర్తి సమయం కేటాయించి వినతులకు పరిష్కారం చూపుతున్న కలెక్టర్



ప్రజాదర్బార్‌లో అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, వినతులు ఇవ్వడానికి వచ్చిన బాధితులు

సాక్షి,యాదాద్రి: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో వస్తున్న వినతుల్లో కొన్ని నెలల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో బాధితులు పదేపదే కలెక్టరేట్ గడప తొక్కుతున్నారు. సమయం, డబ్బు వృథా అవుతోంది. సుదూర ప్రాంతాల నుంచి తరచూ రావాలంటే చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. అధికారులను నిలదీస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. సమస్యను గర్తించిన పాలనాధికారి తన వినూత్న ఆలోచనతో ‘ప్రజాదర్బార్’కు శ్రీకారం చుట్టారు. ప్రతి గురువారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

బాధితులకు భరోసా కల్పిస్తూ..

ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని మధ్యాహ్నం 2నుంచి రాత్రి 8గంటల వరకు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ పూర్తి సమయం అందుబాటులో ఉంటూ బాధితులతో నేరుగా మాట్లాడుతున్నారు. ప్రతి దరఖాస్తుదారుకు సమయం ఇచ్చి సమస్య తెలుసుకుంటున్నారు. దరఖాస్తు ఫారాన్ని స్కాన్ చేసి సంబంధిత శాఖకు పంపిస్తున్నారు. అధికారికి ఫోన్ చేసి మాట్లాడుతున్నారు. అంతేకాకుండా ఫిర్యాదును తనవద్ద ఫైల్ చేసుకొని , పరిష్కారానికి తేదీ ఇచ్చి అర్జీదారులకు భరోసా కల్పిస్తున్నారు. అర్జీలను స్వీకరించిన కలెక్టర్.. సమస్యను నేరుగా అధికారులకు వివరించి పరిష్కారానికి చొరవచూపుతుండటంతో అర్జీదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, బిల్లుల చెల్లింపులో జాప్యం, ఆసరా పింఛన్లు, భూ వివాదాలు, ఆక్రమణలు తదితర సమస్యలపై ఎక్కువగా వినతులు వస్తున్నాయి.

సమస్య తెలుసుకొని,అధికారులను ఆదేశించి..

- ప్రత్యేక గ్రామ పంచాయతీ చేయాలని ఆలేరు మండలం రాజానగర్ ప్రజలు గురువారం కలెక్టర్‌ను కలిశారు. గ్రామం గతంలో కొలనుపాక పంచాయతీలో ఉన్నదని, బైరాంనగర్‌లో కలుపడంవల్ల తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని కలెక్టర్ కు వివరించారు. కలెక్టర్ వెంటనే డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డికి ఫోన్ చేసి గ్రామస్తుల సమస్యను వివరించారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
- నారాయణపురం మండలం పుట్టపాకకు చెందిన అనసూర్య భూసమస్య పరిష్కరించాలని కలెక్టర్‌కు విన్నవించారు. వెంటనే తహసీల్దార్‌కు ఫోన్ చేశారు. బాధితురాలి కుటుంబ సభ్యులతో చర్చించి సమస్య పరిష్కరించాలని సూచించారు.
- ఇందిరమ్మ ఇళ్ల బిల్లు రాలేదని యాదగిరిగుట్టకు చెందిన లబ్ధిదారులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా అక్కడి నుంచే హౌసింగ్ ఉద్యోగితో మాట్లాడి డేటా చెక్ చేయించారు. బిల్లు వచ్చిందని, ఆధార్ సీడింగ్ లేకపోవడంతో లబ్ధిదారుల ఖాతాలో జమ కాలేదని చెప్పారు. వెంటనే ఆధార్ సీడింగ్ చేయాలని కలెక్టర్ అదేశించారు.
- ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని మోత్కూరు మండలం ఆనాజిపురానికి చెందిన పర్వతం సరస్వతి కలెక్టర్‌ను వేడుకున్నారు. ఎంపీడీఓతో మాట్లాడి ఇల్లు మంజూరు చేయాలని ఆదేశించారు. ఇళ్లు మంజూరై నిర్మించుకోలేని వారు ఉంటే రద్దు చేసి ఇవ్వాలన్నారు.
- సైదాపురం చెరువు మత్తడిని తొలగించడంతో తమ పొలాలు మునిగిపోతున్నాయని మాసాయిపేట రైతులు విన్నవించారు. వెంటనే ఇరిగేషన్ ఎస్ఈతో కలెక్టర్ మాట్లాడారు. పర్సనల్ సమస్యగా భావించి పరిష్కరించాలని ఆదేశించారు.

సమస్యల పరిష్కారం కోసం మరింత పాటుపడుతా

గ్రామాలకు వెళ్లినప్పుడు ప్రజలు వివిధ సమస్యలను ఏకరువు పెడుతున్నారు. అంతేకాకుండా ప్రజావాణికి తరచూ వచ్చిపోతున్నారు. ఇలాంటి వారికోసం గురువారం సభ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నా. ప్రజాదర్బార్ పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో చాలా వరకు సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం అవుతున్నాయి. పరిష్కారం కాని సమస్యలను బాధితులకు వివరిస్తున్నా. ప్రజల సమస్యల పరిష్కారం కోసం మరింత పాటుపడుతా. -కలెక్టర్ హనుమంతరావు

తూకం తప్పుతున్న ధర్మకాంటా!

వేబ్రిడ్జిల్లో భారీ వ్యత్యాసాలు

- అనాజిపురం వద్ద వెలుగులోకి
- రెండు ట్రాక్టర్ల ధాన్యం లోడ్లలో సుమారు మూడు క్వింటాళ్లు తేడా
- ఆందోళనకు దిగిన రైతులు, కాంటాకు తాళం



అనాజిపురంలోని వేబ్రిడ్జి వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మోత్కూరు: ఆరుగాలం కష్టపడి సేద్యం చేసిన రైతులు అన్ని విధాలా మోసపోతున్నారు. పండించిన పంట చేతికొచ్చాక దారుణంగా నష్టపోతున్నారు. ప్రైవేట్ వ్యాపారుల దగ్గర ఉన్న ఎలక్ట్రానిక్ కాంటాల దగ్గరనుంచి మిల్లుల వద్ద వే బ్రిడ్జిల వరకు తూకాల్లో తేడా ఉంటుంది. వ్యాపారులు వినియోగించే కాంటాలపై తూనికల, కొలతల వ్యాపారుల దృష్టి సారిస్తే గుట్టు బయటపడుతుంది. త్వరలో ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం కానున్న నేపథ్యంలో తనిఖీలు నిర్వహించకపోతే తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.

ఏం జరిగిందంటే..

మోత్కూరు మండలంలో ముందస్తు వరికోతలు మొదలయ్యాయి. రైతు మలిరెడ్డి సంతోష్‌రెడ్డి 10 ఎకరాల్లో వరి సాగు చేయగా అందులో కొంత భాగంగా కోత కోయించాడు. 98 క్వింటాళ్ల దిగుబడి రాగా రెండు ట్రాక్టర్లలో పాలడుగు గ్రామానికి చెందిన అంతటి నర్సయ్యకు విక్రయించాడు. ధాన్యాన్ని అనాజిపురంలో నర్సయ్యకు చెందిన వేబ్రిడ్జిపై తూకం వేయించాడు. తూకంలో తేడా వచ్చిందని సంతోష్‌రెడ్డికి అనుమానం రావడంతో మరో వేబ్రిడ్జి వద్ద ఖాళీ ట్రాక్టర్‌ను తూకం వేయించగా క్వింటా 40 కిలోలు వ్యత్యాసం వచ్చింది. రెండు ట్రాక్టర్ల ధాన్యం లోడ్‌లో 2 క్వింటాల 80 కిలోలు తేడా వచ్చిందని రైతుల తెలిపాడు.

ఆందోళనకు దిగిన రైతులు

వేబ్రిడ్జి తూకంలో మోసం బయటపడటంతో అదే సమయంలో ధాన్యం విక్రయించడానికి అక్కడికి వచ్చిన రైతులతో పాటు స్థానిక రైతులు కాంటా వద్ద ఆందోళకు దిగారు. మోసాలకు పాల్పడుతున్న వ్యాపారులను నిలదీశారు. తూకంలో మోసాలే కాకుండా వేవింగ్ మిషన్ కోసం ఒక బిల్లు రూ.100, గుమస్తా ఖర్చుల పేరుతో మరో రూ.200 అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. క్వింటా ధాన్యానికి 2 కిలోల చొప్పున తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో విక్రయించిన ధాన్యానికి క్వింటాకు రెండు రూపాయలు కట్ చేసుకుని, నెలలు గడిచినా ఇవ్వడం లేదన్నారు. వేబ్రిడ్జి కాంటాను సీజ్ చేసి, నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.



వ్యాపారిని నిలదీస్తున్న రైతులు

గోనె సంచులు ఎక్కడివి?

అనాజిపురం వే బ్రిడ్జి వద్ద పౌరసరఫరాల శాఖకు చెందిన గోనె సంచులు బయటపడటం కలకలంరేపింది. అధికారికంగా ధాన్యం కొనుగోళ్ల ప్రారంభమే కాలేదు. ఇక్కడి సివిల్ సప్లై బస్తాలు లభ్యం కావడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరు తీసుకువచ్చారు, ఎందుకు తెచ్చారని కాంటా నిర్వాహకులను రైతులు ప్రశ్నించారు.



ప్రైవేట్ కాంటా వద్ద సివిల్ సప్లై సంచులు

వ్యాపారి ఏమన్నాడంటే..

వేబ్రిడ్జి కాంటాలో సాంకేతిక లోపం వల్ల తూకంలో తేడా వచ్చిందని, తాము మోసాలకు పాల్పడలేదని వ్యాపారి, ధర్మకాంటా నిర్వాహకుడు అంతటి నర్సయ్య తన వివరణలో తెలిపారు.గోనె సంచుల గురించి తనకు తెలియదన్నారు. ధర్నాలో రైతులు చిన్న వెంకటయ్య, మలిపెద్ది సంతోష్, చుక్క వెంకటయ్య, దేవర శ్రీశైలం, కరుణాకర్‌రెడ్డి, కొల్లు శంకరయ్య, పద్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉప్పల లక్ష్మయ్య, కొల్లు వెంకన్న, సలిగంజి వెంకన్న, కొల్లు మచ్చగిరి, బీరయ్య, చేపూరి వెంకట్‌రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రిజర్వ్ మద్యం షాపులకు డ్రా

- ఎస్సీ, ఎస్టీ, గౌడ్స్‌కు 30 షాపులు
- జనరల్ కేటగిరీలో 52 కేటాయింపు



డ్రా తీసి చూపుతున్న కలెక్టర్ హనుమంతరావు, పక్కన ఎక్సైజ్ సూపరింటెండెంట్ విష్ణుమూర్తి

సాక్షి,యాదాద్రి: మద్యం దుకాణాల టెండర్ ప్రక్రియ మొదలైంది. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలోని 30 మద్యం దుకాణాలను రిజర్వేషన్ ప్రకారం కేటాయించారు. నాలుగు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 82 మద్యం షాపులు ఉన్నాయి. ఇందులో 30 దుకాణాలను ప్రభుత్వం రిజర్వ్ చేసింది. గౌడ సామాజిక వర్గానికి 15, ఎస్సీలకు 10, ఎస్టీలకు 5 కేటాయించగా, 52 జనరల్ కేటగిరీలో ఉన్నాయి. గురువారం తన చాంబర్‌లో కలెక్టర్ హనుమంతరావు లక్కీడ్రా తీశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ విష్ణుమూర్తి, బీసీ సంక్షేమ అధికారి సాహితీ, ఎస్సీ సంక్షేమ అధికారి జింకల శ్యాంసుందర్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

నూతన మద్యం దుకాణాలకు శుక్రవారం నుంచి అక్టోబర్ 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తు నాన్ రిఫండబుల్ ఫీజు గతంలో రూ.2లక్షలు ఉండగా ఈసారిరూ.3 లక్షలు నిర్ణయించారు. అక్టోబర్ 23న డ్రా తీయనున్నారు. షాపులు దక్కించుకున్నవారు అక్టోబర్ 24వ తేదీ సాయంత్రంలోపు రెంటల్ మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లించాలి. డిసెంబర్ 1న షాపులను ప్రారంభించాలి. ఆరోజు నుంచి రెండేళ్ల కాలానికి పరిమితి ఉంటుంది.

దసరా 2న జరుపుకోవాలి

భువనగిరి : దసరా పండుగను అక్టోబర్ 2న జరుపుకోవాలని బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కప్పగంతుల నాగరాజు శర్మ తెలిపారు. గురువారం భువనగిరిలో దసరా వేడుకల పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. 30వ తేదీన సద్దుల బతుకమ్మ నిర్వహించాలన్నారు.కార్యక్రమంలో జగదీశ్వర్‌శర్మ, శ్రీనివాస్‌శర్మ, రమేష్, విశ్వేశ్వర్‌రావు పాల్గొన్నారు.

‘స్పర్శ్’లో సమస్యలు.. ఉద్యోగుల వెతలు

ఉపాధిహామీ సిబ్బందికి వేతనాల చెల్లింపులో జాప్యం

- రెండు నెలలుగా పెండింగ్
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం
- రాష్ట్రస్థాయి సమస్య అని తేలికగా తీసుకుంటున్న అధికారులు



ఉపాధిహామీ పనులను పర్యవేక్షిస్తున్న ఏపీఓ (ఫైల్)

చౌటుప్పల్ రూరల్: ఉపాధిహామీ ఉద్యోగులు రెండు నెలలుగా వేతనాలు అందక విలవిలలాడుతున్నారు. నిధులు అందుబాటులో ఉన్నా నూతన డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థలో సాంకేతిక సమస్యల వల్ల వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా కుటుంబ పోషణ, పిల్లల ఫీజు, ఇంటి అద్దె తదితర అవసరాలకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఉద్యోగులు వాపోతున్నారు.

కారణాలు ఇవీ..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేసే పథకాల కింద విడుదలయ్యే నిధులను పర్యవేక్షించేందుకు కేంద్రం నూతనంగా స్పర్శ అనే డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థను అందుబాలోకి తీసుకువచ్చింది. అయితే యాప్‌లో సాఫ్ట్‌వేర్లు అనుసంధానం కాకపోవడంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. దీంతో సిబ్బంది వివరాల నమోదులో జాప్యం చోటు చేసుకొని వేతనాల చెల్లింపుపై ప్రభావం చూపుతోంది. సమస్యను అధికారులు పరిష్కరించకపోవడంతో సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు.

గతంలో పే అండ్ అకౌంట్స్ నుంచి వేతనాలు

ఉపాధిహామీ కాంట్రాక్ట్ సిబ్బందికి గతంలో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలోని పే అండ్ అకౌంట్స్ నుంచి నిధులు ట్రాన్స్‌ఫర్ జనరేట్ చేయగానే వెంటనే సిబ్బంది ఖాతాలో జమ అయ్యేవి. స్పర్శ యాప్ ద్వారా ప్రతి నెలా రాష్ట్ర ఖజానా నుంచి మాన్యువల్‌గా అప్రూవ్ చేస్తేనే సిబ్బంది వేతనాలు వచ్చే పరిస్థితి ఉంది. ఈ యాప్‌లో సిబ్బంది వివరాలను ప్రతి నెలా అప్‌లోడ్ చేసే క్రమంలో సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయని అధికారులు అంటున్నారు.

400 మంది ఉద్యోగులు

ఉపాధిహామీ పథకంలోని వివిధ విభాగాల్లో 400 మంది కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్నారు. ఇందులో ఏపీఓలు 14మంది, ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌లు 13, టెక్నికల్ అసిస్టెంట్లు 66, కంప్యూటర్ ఆపరేటర్లు 39, ఫీల్డ్ అసిస్టెంట్‌లు 266 మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.75 లక్షల వరకు వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. రెండు నెలలుగా సుమారుగా రూ.కోటి 50 లక్షలు బకాయిలు ఉన్నాయి. ఉన్నతాధికారులకు తమ గోడు చెప్పుకుంటే పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. ఇది రాష్ట్రస్థాయి సమస్య అని తేలికగా తీసుకుంటున్నారని సిబ్బంది వాపోతున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు చొరవ తీసుకుని సాంకేతిక సమస్యలను పరిష్కరించి సిబ్బందికి వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాత విధానంతో వేతనాలు చెల్లించాలి

కేంద్ర ప్రభుత్వం స్పర్శ అనే నూతన డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థను తీసుకురావడంతో చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సాంకేతిక సమస్య తలెత్తడంతో ఉద్యోగులకు నెలనెలా వేతనాలు రావడం లేదు.గతంలో మాదిరి రాష్ట్ర ఖజానా నుంచి ఫండ్ జనరేట్ సిస్టం ద్వారా జీతాలు ఇస్తే ఎవరికి ఇబ్బంది రాదు. ఉన్నతాధికారులు ఆలోచించి సమస్య పరిష్కరించాలి.

-కొండమడుగు రమేష్, టెక్నికల్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

సాంకేతిక సమస్యల సాకుతో జీతాలు ఆపవద్దు



కాంట్రాక్ట్ పద్ధతిలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాం. మాకు సకాలంలో వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నతాధికారులను సంప్రదిస్తే స్పర్శ యాప్‌లో సాంకేతిక సమస్యలున్నాయని చెబుతున్నారు. సాంకేతిక సమస్యలు చూపి వేతనాలు ఆపడం సమంజసం కాదు. దసరా పండుగ ఎలా జరుపుకోవాలి. పండుగ లోపు వేతనాలు చెల్లించాలి.

-తాటిపాముల శ్రీశైలం, టెక్నికల్ అసిస్టెంట్, చౌటుప్పల్

బతుకమ్మకు గుర్తింపు తెచ్చింది కేసీఆరే

- ప్రభుత్వం వల్లే యూరియా కష్టాలు
- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, కంచర్ల రామకృష్ణారెడ్డి, మహేందర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గొంగిడి సునీత, చిత్రంలో కంచర్ల రామకృష్ణారెడ్డి, గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

యాదగిరిగుట్ట: ఉమ్మడి రాష్ట్రంలో మరుగునపడిన బతుకమ్మకు కేసీఆర్ గుర్తింపు తీసుకువచ్చారని, అధికారిక పండుగా ప్రకటించారని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. యాదగిరిగుట్టలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో గురువారం జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాల్సిన మహిళలు యూరియా కోసం పీఏసీఎస్ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని, రాష్ట్ర ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామిని మాజీ మంత్రి హరీశ్‌రావు వేడుకున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని పేర్కొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఏనాడూ యూరియా కొరత రాలేదన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ యాదగిరి కొండపైకి వెళ్లే ఆటో కార్మికులను ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మోసం చేశారని, కొండపైకి భక్తులను తీసుకెళ్లాలంటే రుసుము చెల్లించాల్సి వస్తుందన్నారు. రూ.32 లక్షలు దేవస్థానానికి చెల్లించాలని ఇటీవల ఆటో కార్మికులకు నోటీసులు ఇచ్చారని, ఎందుకు చెల్లించాలో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మదర్ డెయిరీ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు కర్రె వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, నాయకులు బీమగాని నర్సింహగౌడ్, ఎగ్గిడి కృష్ణ, వంటేరు సురేష్‌రెడ్డి, వస్పరి శంకరయ్య, కసావు శ్రీనివాస్‌గౌడ్, బీర్ల మహేష్, వెంకటేష్‌గౌడ్, తోటకూరి బీరయ్య, కాల్నె అయిలయ్య, కొర్రె భిక్షపతి, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

నా ఆరేళ్ల కష్టం..


దొంతిరెడ్డి రోహిళారెడ్డి

చిలుకూరు: చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన దొంతిరెడ్డి రోహిళారెడ్డి గ్రూప్–1 తుది ఫలితాల్లో డీఎస్పీ పోస్టుకు ఎంపికైంది. ఆమె తండ్రి దొంతిరెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్‌గా పనిచేస్తున్నారు. రోహిళారెడ్డి వరంగల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ)లో బీటెక్ పూర్తిచేసింది. బీటెక్ ఫైనలియర్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ వచ్చినప్పటికీ.. 2019 నుంచి గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతూ గ్రూప్–1 రాసి డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికైనట్లు ఆమె పేర్కొన్నారు.

తండా నుంచి ఆర్డీఓగా..


తెజావత్ అశోక్‌నాయక్

మిర్యాలగూడ: దామరచర్ల మండలం పార్థునాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బతండాకు చెందిన తెజావత్ అశోక్‌నాయక్ గ్రూప్–1 ఫలితాల్లో ఆర్డీఓ ఉద్యోగానికి ఎంపికయ్యారు. అశోక్‌నాయక్ తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. హైదరాబాద్‌లో బీటెక్ పూర్తిచేసి.. సివిల్స్ లక్ష్యంగా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందారు. గ్రూప్–1 రాసి ఆర్డీఓ ఉద్యోగానికి ఎంపికయ్యారు. పేద ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రభుత్వ పథకాలు అన్నివర్గాల ప్రజలకు అందేలా చూస్తానని అశోక్‌నాయక్ తెలిపారు.

డిప్యూటీ జైలర్‌గా..


ఆవుల సతీష్

సూర్యాపేట: ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రానికి చెందిన ఆవుల సతీష్ గ్రూప్–1 తుది ఫలితాల్లో సబ్ జైలర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. సతీష్ తండ్రి ఆవుల వెంకన్న ఫైర్ ఏడీఎఫ్ఓగా పనిచేస్తున్నారు. తమిళనాడులోని వెల్లూరు వీఐటీలో ఇంజనీరింగ్ పూర్తిచేసిన సతీష్ ఢిల్లీలో సివిల్స్ కోచింగ్ తీసుకుంటూ గ్రూప్–1 పరీక్ష రాసి సబ్ జైలర్‌గా ఉద్యోగం సాధించారు. సతీష్‌ను గ్రామస్తులు అభినందించారు.

డిగ్రీ పూర్తికాగానే గ్రూప్‌-1 ఉద్యోగం


జువేరియా

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డ కాలనీకి చెందిన చిరువ్యాపారి ఎండీ మౌజంఅలీ, అమీనాబీ దంపతుల రెండో కుమార్తె జువేరియా గ్రూప్–1 తుది ఫలితాల్లో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికైంది. చిన్నప్పటి చదువులో ముందుండే జువేరియా కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌తో హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్ కళాశాలలో 2023లో డిగ్రీ(బీఎస్సీ మ్యాథ్స్) పూర్తిచేసి గోల్డ్ మెడల్ అందుకుంది. 2024లో గ్రూప్–1 నోటిఫికేషన్ పడగానే దరఖాస్తు చేసుకొని సొంతంగా ప్రిపేర్ అయ్యి మొదటి ప్రయత్నంలోనే అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ ఉద్యోగం సాధించింది. జువేరియా అక్క సుమయ్య పర్వీన్ కూడా డీఎస్సీ సాధించి ప్రస్తుతం కోదాడ ఉర్దూ మీడియం పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తోంది.

కలెక్టర్ కావడమే లక్ష్యం

గ్రూప్–1లో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్‌గా ఉద్యోగం సంపాదించడం ఎంతో సంతృప్తినిచ్చింది. డిగ్రీ పూర్తయ్యే వరకు గ్రూప్స్ రాస్తానని అనుకోలేదు. డిగ్రీ పూర్తికాగానే నోటిఫికేషన్ రాగానే దరఖాస్తు చేసుకున్నా. ఆ వెంటనే దానికి అవసరమైన మెటీరియల్‌ను యూట్యూబ్, నెట్ ద్వారా సేకరించుకున్నాను. ఆయా మెటీరియల్స్‌ను హైదరాబాద్ నుంచి తెప్పించుకుని రోజుకు 12 నుంచి 14 గంటలు చదివాను. భవిష్యత్తులో సివిల్స్ రాసి కలెక్టర్ కావడమే నా లక్ష్యం. నా విజయం వెనుక నా తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంది. – జువేరియా

జూనియర్ అసిస్టెంట్ నుంచి ఎంపీడీఓగా..


కత్తి శివశంకర్‌రెడ్డి

పెద్దవూర: : గ్రూప్–1 ఫలితాల్లో మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కత్తి శివశంకర్‌రెడ్డి ఎంపీడీఓగా ఎంపికయ్యారు. శివశంకర్‌రెడ్డి స్వస్థలం పెద్దవూర మండలం బట్టుగూడెం గ్రామం. శివశంకర్‌రెడ్డి చిన్నతనంలోనే అతడి తండ్రి రాంచంద్రారెడ్డి మృతిచెందారు. దీంతో తల్లి పద్మ వ్యవసాయం చేస్తూ శివశంకర్‌రెడ్డితో పాటు అతడి చెల్లిని చదివించింది. బీటెక్ పూర్తిచేసిన శివశంకర్‌రెడ్డి ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగం చేస్తూనే గ్రూప్స్‌కు సన్నద్ధమయ్యారు. ఈ క్రమంలోనే గ్రూప్–4లో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. జూనియర్ అసిస్టెంట్‌గా తన బాధ్యతలను నిర్వహిస్తూనే గ్రూప్–1 పరీక్షలకు పట్టుదలతో సన్నద్ధమై అనుకున్న ఎంపీడీఓ ఉద్యోగాన్ని సాధించారు. అతడు రెండు పర్యాయాలు సివిల్స్ మెయిన్స్‌కు కూడా అర్హత సాధించారు. తన కుమారుడికి గ్రూప్–1 ఉద్యోగం రావడంతో అతడి తల్లి సంతోషం వ్యక్తం చేస్తోంది.

కష్టానికి ఫలితం.. కొలువుల ఆనందం

వారందరూ అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు పట్టుదలతో అహర్నిషలు కష్టపడి చదివారు. క్రమశిక్షణతో చదువుకుంటూ ఒక్కో మెట్టు ఎక్కుతూ టీజీపీఎస్సీ ప్రకటించిన గ్రూప్–1 తుది ఫలితాల్లో ఉన్నత స్థాయి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లాలో గ్రూప్–1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులపై ప్రత్యేక కథనాలు..

మున్సిపల్ కమిషనర్‌గా ఎంపికైన శ్రీజారెడ్డి


తల్లిదండ్రులతో నర్రా శ్రీజారెడ్డి

నల్లగొండ: గ్రూప్–1 తుది ఫలితాల్లో నల్లగొండ పట్టణానికి చెందిన నర్రా శేఖర్‌రెడ్డి, కరుణ దంపతుల కుమార్తె నర్రా శ్రీజారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా ఉద్యోగం సాధించింది. ఇప్పటికే ఆమె గ్రూప్–4 ఉద్యోగానికి ఎంపికై సంగారెడ్డి మెడికల్ కాలేజీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తోంది. అంతేకాకుండా గ్రూప్–3 ఫలితాల్లో కూడా 111వ ర్యాంకు సాధించింది. గ్రూప్–2 ఫలితాలు వెలువడాల్సి ఉంది. శ్రీజారెడ్డి తండ్రి శేఖర్‌రెడ్డి ఎస్జీటీ టీచర్‌గా నార్కట్‌పల్లి మండలం ఏనుగులదొరి గ్రామంలో పనిచేస్తున్నారు. వారి స్వస్థలం చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామం. శ్రీజారెడ్డి డిగ్రీ పూర్తిచేసి ఇంట్లోనే ఉండి సొంతంగా పోటీ పరీక్షలకు సిద్ధమైంది. శ్రీజారెడ్డి గ్రూప్–1 ఉద్యోగం సాధించడం పట్ల ఆమె తల్లిదండ్రులు శేఖర్‌రెడ్డి, కరుణ ఆనందం వ్యక్తం చేశారు. మొదట నుంచి శ్రీజారెడ్డి చదువులో చురుకుగా ఉండేదని, ఆమె ఇష్టం ప్రకారమే డిగ్రీ చదివించామని వారు పేర్కొన్నారు.

అమ్మానాన్న ప్రోత్సాహంతోనే సాధ్యమైంది

చదువు విషయంలో మా అమ్మానాన్న ఎప్పుడు నాపై ఒత్తిడి చేయలేదు. నువ్వు ఎన్ని సంవత్సరాలు చదివినా.. చదివిస్తామని చెప్పి నన్ను ప్రోత్సహించారు. 2020లో డిగ్రీ పూర్తయినప్పటి నుంచి ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాను. సివిల్స్‌కు కూడా రాశాను. ఆ అనుభవమే గ్రూప్–1 మెయిన్స్‌కు ఉపయోగపడింది. అమ్మానాన్నల ప్రోత్సాహంతోనే ఉద్యోగం సాధించాను. – శ్రీజారెడ్డి

గెలుపు.. 'రుచి'త చూసింది


రుచితకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన ఎల్లబోయిన రుచిత గ్రూప్–1 తుది ఫలితాల్లో డీఎస్పీ ఉద్యోగం సాధించింది. మిర్యాలగూడ మండలం మొలకల పట్నం గ్రామానికి చెందిన ఎల్లబోయిన రవి, శోభ దంపతులు 30 ఏళ్ల క్రితం కొండమల్లేపల్లి పట్టణ కేంద్రానికి వలస వచ్చి వెటర్నరీ మెడికల్ షాప్ నిర్వహిస్తున్నారు. వారి ఏకైక కుమార్తె రుచిత హైదరాబాద్‌లో డిగ్రీ పూర్తిచేసి ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో ఢిల్లీలో సివిల్స్ కోచింగ్ తీసుకుంది. ఈ క్రమంలో గ్రూప్–1 రాసి డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికైంది. కలెక్టర్ కావాలనే రుచిత కోరికను తాము ఎంతో ప్రోత్సహించామని, నిత్యం 14 గంటల పాటు చదివిన కష్టానికి మంచి ఫలితం దక్కిందని ఆమె తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. కుమార్తెకు స్వీట్స్ తినిపించి తమ ఆనందాన్ని పంచుకున్నారు.

అనాథ నుంచి డీఎస్పీ స్థాయికి..


ముడుసు శ్రీకాంత్

గుర్రంపోడు: చిన్న వయస్సులోనే తల్లిదండ్రులను కోల్పోయినా కష్టపడి గ్రూప్–1లో డీఎస్పీ ఉద్యోగం సాధించారు గుర్రంపోడు మండలం జిన్నాయిచింత గ్రామానికి చెందిన ముడుసు శ్రీకాంత్. అతడి తల్లిదండ్రులు భిక్షమయ్య, చెన్నమ్మ అనారోగ్యంతో మృతిచెందడంతో శ్రీకాంత్‌ను, అతడి తమ్ముడు కృష్ణకాంత్‌కు కొండమల్లేపల్లిలోని సోలిడార్ తెలంగాణ అనే స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచి ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదివించడమే గాక గ్రూప్స్ కోసం శిక్షణ ఇప్పించింది. శ్రీకాంత్ ట్యూషన్లు చెప్పుకుంటూ నిజాం కళాశాలలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తిచేసి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. 2014లో రైల్వేలో టెక్నికల్ ఆఫీసర్‌గా, 2018లో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు వచ్చినప్పటికీ కలెక్టర్ కావాలని ఆ ఉద్యోగాల్లో చేరకుండా గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యారు. ఆ తర్వాత వచ్చిన పంచాయతీ కార్యదర్శి ఉద్యోగంలో చేరి పట్టుదలతో చదివి గ్రూప్–1లో రాష్ట్రస్థాయిలో ఎస్సీ కేటగిరిలో ఆరో సాధించి డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికయ్యారు.

తల్లిదండ్రుల బాటలో..


సందీప్‌కు స్వీట్ తినిపిస్తున్న తండ్రి వెంకటాద్రి

తిరుమలగిరి(తుంగతుర్తి): గ్రూప్–1 ఫలితాల్లో తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు పత్తి వెంకటాద్రి కుమారుడు పత్తి సందీప్‌కుమార్ డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికయ్యారు. సందీప్‌కుమార్ 2020లో ఇంజనీరింగ్ పూర్తిచేసి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ఈ క్రమంలోనే గ్రూప్–1 రాసి మొదటి ప్రయత్నంలోనే డీఎస్పీగా ఎంపికయ్యారు. సందీప్ తండ్రి వెంకటాద్రి అడ్డగూడూరులో గెజిటెడ్ హెడ్మాస్టర్‌గా.. తల్లి లలిత వైద్యారోగ్య శాఖలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు.

సొంత ప్రిపరేషన్‌తో..


పోటు సంకీర్త్

కోదాడ: గ్రూప్–1 తుది ఫలితాల్లో మోతె మండలం అన్నారిగూడెం గ్రామానికి చెందిన పోటు ఉపేందర్‌రావు, సత్యావతి దంపతుల కుమారుడు సంకీర్త్ ఎంపీడీఓ ఉద్యోగానికి ఎంపికయ్యారు. అంతేకాకుండా గ్రూప్–2లో 642వ ర్యాంకు సాధించగా.. గ్రూప్–4 రాసి రెవెన్యూ విభాగంలో ఉద్యోగం సాధించారు. సివిల్స్ 2025 మెయిన్స్ పరీక్ష రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. ఎంపీడీఓ ఉద్యోగం సాధించినందుకు చాలా ఆనందంగా ఉందని సంకీర్త్ పేర్కొన్నారు. సొంతంగా నోట్స్ తయారు చేసుకుని, స్టాండర్డ్ బుక్స్ చదివి తాను ఉద్యోగం పొందినట్లు తెలిపారు. ఉద్యోగ సాధనలో తన తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేదనిదన్నారు.

సివిల్స్‌కు సన్నద్ధమవుతూ డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపిక


దాడి వెంకటరమణ

నల్లగొండ: నల్లగొండకు చెందిన దాడి వెంకటరమణ గ్రూప్–1 ఫలితాల్లో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. వెంకటరమణ తండ్రి దాడి శ్రీనివాసరావు ఈఈడబ్ల్యూఐడీసీలో ఏఈగా పనిచేస్తుండగా.. తల్లి రమాదేవి ఎస్జీటీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. వెంకటరమణ వరంగల్‌లో ఎన్ఐటీలో ఇంజనీరింగ్, ఓపెన్ యూనివర్సిటీలో ఎంఏ పొలిటికల్ సైన్స్ పూర్తిచేశారు. ప్రస్తుతం బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఆరేళ్లుగా సివిల్స్‌కి ప్రిపేరవుతూ గ్రూప్–1లో డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. అంతకుముందు ఆయన సివిక్స్ జూనియర్ లెక్చరర్‌గా, డివిజనల్ అకౌంట్ ఆఫీసర్ ఉద్యోగాలకు కూడా ఎంపికయ్యారు. గ్రూప్–2లో 378 ర్యాంకు సాధించారు.

ఐఏఎస్ కోసం సన్నద్ధమయ్యా..

నేను యూపీఎస్సీ ద్వారా ఐఏఎస్‌కు ఎంపిక కావాలని ప్రిపేర్ అయ్యా. 6 సంవత్సరాలుగా 4 సార్లు పరీక్ష రాసినా ఎంపిక కాలేదు. గ్రూప్–1 పరీక్ష రాసి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికై ఆ కోరికను తీర్చుకున్నా. చాలా సంతోషంగా ఉంది. మా అమ్మానాన్నలు ఎంతో ఆనందపడుతున్నారు. – దాడి వెంకటరమణ

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



మిర్యాలగూడ అర్బన్: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ–కొండ్రపోల్ మధ్య రైలు పట్టాలపై బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురుగా వెళ్లడంతో రైలు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అతడిని 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు కోలముఖంతో 6.5 అడుగుల ఎత్తు ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. తెలుపు రంగు షర్టు, జీన్స్ ప్యాంట్ ధరించినట్లు పేర్కొన్నారు. నల్లగొండ రైల్వే స్టేషన్ మాస్టర్ రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లగొండ రైల్వే ఎస్ఐ బొడిగె రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిమెంట్ లారీ ఢీకొని బాలిక మృతి


రోడ్డు ప్రమాదానికి గురైన కారు


అద్వితీరియా (ఫైల్)

కట్టంగూర్, నకిరేకల్ : ఆగి ఉన్న కారును సిమెంట్ లారీ ఢీకొనడంతో బాలిక మృతిచెందింది. ఈ ఘటన కట్టంగూర్ మండలం ముత్యాలమ్మగూడెం గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ పట్టణంలోని చీమలగడ్డకు చెందిన కందుల రుతు ఝాన్సీ తన కుమార్తె లవీణతో పాటు ఇద్దరు మనుమరాళ్లు రెముడాల అద్వితీరియా(14), ఎండీ అలీనతో కలిసి స్వగ్రామం నుంచి కారులో హైదరాబాద్‌లో ఉంటున్న తన కుమారుడి వద్దకు గురువారం ఉదయం బయల్దేరారు. మార్గమధ్యలో కట్టంగూర్ మండలం ముత్యాలమ్మగూడెం గ్రామ శివారులోని గచ్చుగురు చెరువు వద్దకు రాగానే కారు వెనుక టైరు పంక్చర్ కావడంతో డ్రైవర్ విజయవాడ–హైదరాబాద్ హైవే పక్కన ఆపాడు. కారులో ఉన్న వారందరూ కిందికి దిగి హైవే పక్కకు నిలబడగా.. అద్వితీరియా కారు ముందు భాగంలో నిలబడింది. డ్రైవర్ ఏర్పుల సామేల్ టైరు మార్చుతున్న క్రమంలో కోదాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న సిమెంట్ లారీ అతివేగంగా వచ్చి కారును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో కారు ముందుకు దూసుకపోవటంతో క్యాబిన్ ముందు ఉన్న అద్వితీరియాను తలకు తీవ్రగాయాలయ్యాయి. అదేవిధంగా అలీనకు స్వల్ప గాయాలయ్యాయి. వారిద్దరిని 108 వాహనంలో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ అద్వితీరియా మృతి చెందింది. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాపత్రికి తరలించారు. మృతురాలి తాత కందుల లాజరస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మునుగోటి రవీందర్ తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ లారీని అక్కడే నిలిపి పారిపోయాడు.

సాగర్‌కు తగ్గుముఖం పట్టిన వరద


26 గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

- ఎగువ నుంచి 2,93,744 క్యూసెక్కుల వరద
- 26 గేట్ల ద్వారా నీటి విడుదల

నాగార్జునసాగర్: సాగర్‌కు ఎగువ నుంచి వస్తున్న వరద కొంత మేర తగ్గింది. గత రెండు రోజులు 3లక్షల క్యూసెక్కులకు పైగా వరద రాగా.. గురువారం 2,93,744 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో 26 క్రస్ట్ గేట్ల ద్వారా 2,28,330 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో 33,130, కుడి కాల్వ, ఏఎమ్మార్పీ వరద కాల్వల ద్వారా 11,719 క్యూసెక్కులు కలిపి 2,73,169 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ గరిష్ట స్థాయి నీటిమట్టం 590(312 టీఎంసీలు) అడుగులు కాగా ప్రస్తుతం 586.70(303 టీఎంసీలు) అడుగుల మేర నీటి మట్టం ఉంది.

ఎడమ కాల్వకు నీటి నిలిపివేత

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సాగర్ ఎడమ కాల్వకు అధికారులు గురువారం నీటి విడుదలను నిలిపివేశారు. ఉదయం నుంచే నీటిని తగ్గిస్తూ.. మధ్యాహ్నం 2గంటలకు పూర్తిగా నీటిని నిలిపివేశారు.

దొంగ అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు


వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్

సూర్యాపేట: ఒకే రోజు పలు ఇళ్లలో చోరీకి పాల్పడిన దొంగపై కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. డీఎస్పీ విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని సీతారాంపురం కాలనీకి చెందిన గంపల శ్యామ్ ఈ నెల 22న చివ్వెంల మండలంలోని కొండలరాయినిగూడెం గ్రామానికి చెందిన వల్లపురాణి, కొంపల్లి జయమ్మ, అల్లి మల్లిక ఇళ్లలో చోరీకి పాల్పడి, బంగారం, వెండి వస్తువులు అపహరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి. మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం బీబీగూడెం గ్రామ శివారులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన గంపల శ్యామ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. తాను చోరీ చేసినట్లు నిజం ఒప్పుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి బైక్, నల్లపూసల గొలుసు 14.5 గ్రాములు, జుంకాలు 1.23 గ్రాములు, మూడు జతల పట్టీలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐలు మహేశ్వర్, కనకరత్నం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో అష్టోత్తర శతఘటాభిషేకం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతిని పురస్కరించుకొని గురువారం ఉదయం ఆలయంలో అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో స్వాతి హోమాన్ని నిర్వహించి, పంచామృతాలు, శుద్ధ జలాలు, పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో నింపిన బంగారు, వెండి కలశాలకు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అష్టోతర శతఘటాభిషేకం చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో నిత్య పూజలు విశేషంగా కొనసాగాయి. ఇక స్వాతి నక్షత్రం పురస్కరించుకొని భక్తులు, ఆలయ ఉద్యోగులు, అర్చకులు, స్థానికులు గిరి ప్రదక్షిణ చేపట్టారు. ఉదయం 5గంటలకు కొండ కింద గల వైకుంఠద్వారం వద్ద ప్రత్యేక పూజలు చేసి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొని, స్వామివారి పాదాల వద్ద, వైకుంఠ ద్వారం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.


ఆలయ ముఖ మండపంలో బంగారు, వెండి కలశాల్లో పంచామృతాలకు పూజలు చేస్తున్న అర్చకులు

బంగారు ఆభరణాల చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

- 18 తులాల బంగారు ఆభరణాలు, కారు, సెల్‌ఫోన్ స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్: బంగారు ఆభరణాల దొంగతనం కేసులో ఇద్దరు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట ఎస్పీ కె. నరసింహ తెలిపారు. నిందితుల నుంచి 18 తులాల బంగారం ఆభరణాలు, ఒక కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కేసు వివరాలను గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వెల్లడించారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలానికి చెందిన పులిచింతల అరుంధతి 2024 ఆగస్టు 18న సూర్యాపేట జిల్లా మోతె మండలం విభలాపురం గ్రామంలో తన బంధువుల పెళ్లికి బయల్దేరింది. తన బంగారు ఆభరణాలు ఉన్న హ్యాండ్‌బ్యాగ్‌తో సూర్యాపేట బస్టాండ్‌లో ఖమ్మం డిపోకు చెందిన బస్సు ఎక్కి మోతెకు వెళ్తుండగా.. గుర్తుతెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మోతె పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా బుధవారం సాయంత్రం మోతె మండలం మామిళ్లగూడెం టోల్‌ప్లాజా వద్ద మునగాల సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. హైదరాబాద్ నుంచి కారులో వస్తున్న ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని ఆపారు. వారి వద్ద 18 తులాల బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించారు. పట్టుబడిన వారు ఏపీలోని కర్నూలు జిల్లా బుద్రాపేట్ గ్రామానికి చెందిన గారడి జ్యోతి(ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం), హైదరాబాద్‌లోని బడంగ్‌పేటకు చెందిన మహమ్మద్ షేక్ సమీర్‌గా పోలీసులు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. పులిచింతల అరుంధతి హ్యాండ్‌బ్యాగ్‌లోని బంగారు ఆభరణాలను బస్సులో దొంగలించినట్లు వారు ఒప్పుకున్నారు. నిందితురాలు గారడి జ్యోతిపై హైదరాబాద్ పరిసర ప్రాంతాల పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు దొంగతనం కేసులు ఉన్నందున.. బంగారు ఆభరణాలు అక్కడ అమ్మితే అనుమానం వచ్చి అరెస్ట్ చేస్తారని.. వాటిని దాచి బుధవారం ఆంధ్రా ప్రాంతంలో అమ్మేందుకు కారులో వెళ్తుండగా పట్టుబడినట్లు ఎస్పీ తెలిపారు. వీరిద్దరికి సహకరించిన దుర్గ అనే మహిళ పరారీలో ఉన్నట్లు చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ రవి, మునగాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మెకానిక్ మృతి


హనుమయ్య (ఫైల్)

సూర్యాపేట: వ్యవసాయ బావి వద్ద విద్యుత్ వైర్లను చెక్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మెకానిక్ మృతిచెందాడు. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని దాచారం గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దాచారం గ్రామానికి చెందిన విద్యుత్ మెకానిక్ బుడిగబోయిన హనుమయ్య(58) గురువారం అదే గ్రామానికి చెందిన పులుగుజ్జు మల్లయ్య అనే రైతు వ్యవసాయ బోరు వద్ద ఉన్న విద్యుత్ వైరుకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో సరిచేసేందుకు వెళ్లాడు. విద్యుత్ వైర్లు పరిశీలిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై హనుమయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. హనుమయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని అతడి బంధువులు మృతదేహాన్ని రైతు పులుగుజ్జు మల్లయ్య ఇంటి ముందు ఉంచి నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా రైతు మల్లయ్యను అదుపులోకి తీసుకున్నారు. మృతుడు హనుమయ్య కుమారుడు శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

నల్లగొండ: భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ ఫ్యామిలీ కోర్టు జడ్జి డి. దుర్గాప్రసాద్ గురువారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. తిప్పర్తి మండలం మామిడాల గ్రామానికి చెందిన కోదాటి శ్రీను, మిర్యాలగూడ మండలం బాదలాపురం గ్రామానికి చెందిన వాణి పెద్దమనుషుల సమక్షంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సతానం. శ్రీను ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నాళ్ల పాటు వీరి దాంపత్య జీవితం సజావుగా సాగింది. ఆ తర్వాత వీరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో వాణిని శ్రీను కొట్టడంతో ఆమె తన పుట్టింటికి వెళ్లింది. పెద్దమనుషుల మధ్య పంచాయితీ పెట్టి నచ్చజెప్పడంతో ఆమె కాపురానికి వచ్చింది. 2024 డిసెంబర్ 3వ తేదీన ఇంట్లో వాణి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. వాణి తల్లితండ్రులు అల్లుడు శ్రీను, అతడి తల్లితండ్రులు, అన్న వదినలపై తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ ప్రశాంత్ కేసు నమోదు చేయగా.. శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి విచారణ జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. జవహర్‌లాల్ కోదాటి శ్రీను తన భార్య వాణిని హత్య చేసినట్లు ఆధారాలు కోర్టుకు సమర్పించాడు. ఆయన వాదనలతో ఏకీభవించిన నల్లగొండ ఫ్యామిలీ కోర్టు జడ్జి డి. దుర్గా ప్రసాద్ శ్రీనుకు జీవిత ఖైదుతో పాటు మరో 5 సంవత్సరాలు జైలుశిక్ష, రూ.20 వేల జరిమానా, శ్రీను తల్లితండ్రులు కోదాటి రాములు, కన్నమ్మ, అన్న, వదినలు నాగరాజు, మౌనికకు 2 సంవత్సరాల 6 నెలల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. లైజన్ ఆఫీసర్ పి. నరేందర్, ఎన్. మల్లికార్జున్, కోర్టు కానిస్టేబుల్ డి. కిరణ్‌కుమార్ సరైన ఆధారాలు సమర్పించి నిందితులకు శిక్ష పడడంలో కోర్టుకు సహకరించారు.